క్లుప్తంగా

సింహవల్లీ తాయారుకు తిరువీధి

సింహాచలం: సింహగిరిపైనున్న సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం సాయంత్రం విశేషంగా తిరువీధి జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో అధిష్టింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు.

గణపతికి ఘనంగా పూజలు



కల్యాణంలో పాల్గొన్న శరగడం చినఅప్పల నాయుడు దంపతులు

పెందుర్తి: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. పెందుర్తి పాతూరులో గణపతి మండపంలో సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, అనురాధ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

- రాంపురంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు గణపతిని దర్శించుకున్నారు.

వెంకన్నకు దధ్యాభిషేకం

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భాద్రపద మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి 120 లీటర్ల పెరుగుతో దధ్యాభిషేకం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఆదర్శ్ కళాశాలకు బెస్ట్ డిసిప్లిన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిస్ట్రిక్ట్ పెరేడ్‌లో పాల్గొన్న పెందుర్తి ఆదర్శ్ కళాశాలకు ఉత్తమ క్రమశిక్షణ అవార్డు లభించింది. శుక్రవారం నగరంలోని సొసైటీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును కళాశాల కరెస్పాండెంట్ టి.థియోఫిలాస్ అందుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసుల్లో ముగ్గురి అరెస్ట్

పెందుర్తి: దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 13.86 తులాల బంగారు, 529 తులాల వెండి వస్తువులతో పాటు నేరం చేయడానికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు. విజయగనగరం జిల్లా బొబ్బిలి(ప్రస్తుతం గుంటూరులో నివాసం)కి చెందిన మర్రి రవికుమార్ అలియాస్ మున్నా, సుజాతనగర్ సమీపంలోని పాపయ్యరాజుపాలెం భవానీనగర్‌కు చెందిన మర్రి కనకారావు అలియాస్ డేవిడ్, విజయనగరం జిల్లా కోడూరు(ప్రస్తుతం ఒంగోలులో నివాసం)కి చెందిన పూతి సురేష్‌లు ఓ బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పాపయ్యరాజుపాలెంతో పాటు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనాలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తరుణంలో శుక్రవారం రాత్రి ముగ్గురు నిందితులు సుజాతనగర్ ప్రాంతంలో సంచరిస్తుండగా మాటు వేసి పోలీసులు పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసు

పెందుర్తి: మండలంలోని చింతగట్లలో వినాయక నిమజ్జనోత్సవంలో గురువారం రాత్రి ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. పరస్పర ఫిర్యాదుల మేరకు కొట్లాట నేరంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పెందుర్తి సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపారు.



‘సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి మేం చిత్తశుద్ధితో ఉన్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి కేబినెట్‌లోనే దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తాం. మమ్మల్ని(కూటమి అభ్యర్థుల్ని) గెలిపిస్తే అసెంబ్లీలో దీనిపై గళం వినిపించి భూ సమస్యను పరిష్కరిస్తాం. తాడి గ్రామాన్ని తరలించేందుకు ఆరు నెలల ప్రణాళిక వేసుకుని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్యాచరణ రూపొందిస్తాం’

ఏప్రిల్‌లో పెందుర్తిలో జరిగిన ఎన్నికల సభలో ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గుప్పించిన హామీల్లో ప్రధానమైనవి.



‘నన్ను గెలిపించండి. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పంచగ్రామాల భూ సమస్యకు పరిష్కారం చూపుతా. తాడి గ్రామం తరలింపుతో పాటు వేపగుంట–పినగాడి రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తా. పరవాడలోని ఎన్టీపీసీ, ఫార్మా సిటీ కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం. ఈ సమస్యల పరిష్కారానికి ఏళ్లతరబడి సమయం తీసుకోను. గతంలో ఎమ్మెల్యేగా చేసిన అనుభవంతో గెలిచిన వెంటనే సమస్యల్ని పరిష్కరిస్తా.

ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ఊరూవాడా తిరుగుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇచ్చిన హామీల్లో కొన్ని..



సింహాచలం దేవస్థానం పంచగ్రామాల పరిధిలో ఓ భాగం

వంచనకు వంద రోజులు



- దేవస్థానం భూ సమస్యపై అడుగు కూడా ముందుకు పడని వైనం
- ఫార్మా కాలుష్య బాధిత తాడి గ్రామం తరలింపుపై కప్పదాట్లు
- నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల నిర్మాణంపై స్పష్టత కరవు
- ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి.. ఇప్పుడు ఊసెత్తని కూటమి నేతలు



పరవాడలో ఫార్మా సిటీ కాలుష్యం కోరల్లోని తాడి గ్రామం



వేపగుంట-పినగాడి రోడ్డు దుస్థితి

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా.. పై సమస్యల పరిష్కారం వైపు కనీసం ఒక్క అడుగు కూడా పడలేదు. పంచగ్రామాల భూ సమస్యపై కింది స్థాయి అధికారుల తూతూ మంత్రపు ప్రకటనల తప్ప సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. తాడి గ్రామం తరలింపుపై ‘త్వరలో మాట్లాడదాం’అన్న దాటవేత మాటలు తప్ప ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకునే పరిస్థితి ఇప్పటికీ కనిపించట్లేదు. రెండు మూడు రోజుల్లో వేపగుంట-పినగాడి రోడ్డు పనులు ప్రారంభిస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే మాటలు గాలి మూటలే అయ్యాయి. ఇక నియోజకవర్గంలోని ప్రముఖ కంపెనీలు, విద్యా సంస్థల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పనపై ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. మొత్తానికి ఈ వంద రోజుల ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలకు జరిగిన మంచిని భూతద్దంలో చూద్దామన్నా కనిపించని దుస్థితి.

గాలి ప్రకటనలతో తాత్సారం

పంచ (వేపగుంట, సింహాచలం, వెంకటాపురం, అప్పన్నపాలెం, చీమలాపల్లి) గ్రామాల భూ సమస్య పరిష్కారంపై ఎన్నికల ప్రచారంలో పవన్‌కల్యాణ్ ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ప్రభుత్వంతో సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వెనువెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజల్ని నమ్మించారు. అధికారంలోకి వచ్చిన తరువాత రెండుసార్లు కేబినెట్ సమావేశం జరిగింది. కనీసం ఒక్కసారి కూడా దేవస్థానం భూ సమస్య గురించి కనీస చర్చ జరగలేదు. వాస్తవానికి రెండున్నర దశాబ్దాల క్రితం టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే ఈ భూ సమస్య తలెత్తింది. అప్పట్లో సమస్యను పరిష్కరించకపోగా మరింత జటిలం చేసింది టీడీపీయేనని స్థానికుల ఆరోపణ. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

తాడి తరలింపుపై మీనమేషాలు

పరవాడ మండలంలోని ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న తాడి గ్రామ ప్రజలకు ఇప్పట్లో ఊరట లభించేలా లేదు. ఎన్నికల సమయంలో ఆరు నెలల్లో తాడి గ్రామాన్ని పూర్తిగా తరలిస్తామన్నారు. అందుకు తగ్గ కార్యాచరణ అధికారం చేపట్టిన తొలిరోజు నుంచే ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే రమేష్‌బాబు ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటుతున్నా దీనిపై ఎలాంటి చర్యలు లేవు. ఇటీవల తాడి గ్రామం తరలింపుపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలవగా గ్రామాన్ని తరలించేందుకు స్థల పరిశీలన చేయాలని అధికారులకు చెప్పారు. అయితే ఆ ప్రక్రియ మాటల వరకేనని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు.

రోడ్డు పనులకు కొర్రీలు

నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల్లో వేపగుంట-పినగాడి రోడ్డు ఒకటి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపులు, టెండర్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే కాంట్రాక్టర్(ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే) నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వేపగుంట కూడలి నుంచి చింతలగ్రహారం వంతెన వరకు రోడ్డును నిర్మించేందుకు నిధులు కేటాయించారు. ఈ క్రమంలో పనులు నాలుగైదు రోజుల్లో ప్రారంభమవుతాయన్న తరుణంలో ఎన్నికలు రావడంతో ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే ఎమ్మెల్యే పంచకర్ల రెండు మూడు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. తమ పరిధిలో ఉన్న రోడ్డును జీవీఎంసీ నిధులతో నిర్మించడమేంటని ఆర్‌అండ్‌బీ అధికారులు కొర్రీ వేశారు. దీంతో ఆ నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే రమేష్‌బాబు ఇంతవరకు ఎలాంటి చొరవ తీసుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు.

తాడి తరలింపుపై నిర్ణయం తీసుకోవాలి



ఫార్మా సిటీ కాలుష్యంతో తాడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలతో మరింత భయాందోళనలకు గురవుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం తాడి తరలింపుపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే పరిస్థితి మరింత క్షీణిస్తుంది.

– దళాయి నదియా, ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, పరవాడ

రోడ్డు పనులు ప్రారంభించాలి



వేపగుంట నుంచి పినగాడి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఇటుగా ప్రయాణం చేయాలంటే ఇబ్బందికరంగా ఉంది. గతేడాదే రోడ్డు పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అయితే ఎన్నికలు రావడంతో ఆగిపోయాయని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు ప్రారంభిస్తే మాకు ఇబ్బందులు తప్పుతాయి.

– దువ్వు అప్పారావు, చీమలాపల్లి

భూములున్నా అవసరాలు తీరట్లేదు



పంచ గ్రామాల, వుడా భూ సమస్య కారణంగా ఇబ్బందులకు గురవుతున్నాం. భూములున్నా పెళ్లి, విద్య, వైద్యం తదితర అవసరాలకు అక్కరకు రాని దుస్థితి. ఆస్తులున్నా అమ్ముకోలేక.. అప్పులు చేయాల్సి వస్తోంది. పాతికేళ్లుగా ఇక్కడి ప్రజలు నరకం చూస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు భూ సమస్యను పరిష్కరించాలి.

– ముత్తా అప్పలరాజు, వేపగుంట

సెజ్‌ల వద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలి

- సీపీఎం రక్షణ యాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శి లోకనాథం



రక్షణ యాత్రలో మాట్లాడుతున్న లోకనాథం

పరవాడ: కార్మికుల సౌకర్యార్థం ఫార్మా సెజ్‌లు ఉన్న ప్రదేశాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సెజ్ కార్మికుల భద్రత కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 16న పాయకరావుపేటలో ప్రారంభమైన రక్షణ యాత్ర శుక్రవారం లంకెలపాలెం చేరుకుంది. ఇక్కడ జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఫార్మా సెజ్‌లు ఉన్న ప్రదేశాల్లో కార్మికులు ప్రమాదాలకు గురైనపుడు దూర ప్రాంతాలైన అనకాపల్లి, విశాఖలోని ఆస్పత్రులకు తరలించే లోపు కార్మికులు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెజ్‌ల ప్రారంభంలో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయట్లేదని ఆక్షేపించారు. పరిశ్రమల్లో భద్రత, కార్మికుల రక్షణ కోసం సీపీఎం చేపట్టిన బైక్ యాత్రకు కార్మికులు, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ రమణ, పి.మాణిక్యం, వీవీ శ్రీనివాసరావు, దేముడు పాల్గొన్నారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

- డీఎస్‌ఎన్‌ఎల్‌యూలో మధ్యవర్తిత్వ పోటీలు ప్రారంభం





మాట్లాడుతున్న డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వీసీ, అధ్యాపకులు, పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల విద్యార్థులు

సబ్బవరం: ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయంగా, అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యత పెరిగిందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ) ఉపకులతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక విశ్వవిద్యాలయంలో డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో దేశంలోని వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి పెరిగిన ప్రాముఖ్యతకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాల ఆధారంగా ప్రాక్టికల్‌గా మధ్యవర్తిత్వం ఎలా వహించాలి? జాతీయ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా వివాదాలను పరిష్కరించే విధానంలో శిక్షణ కోసం ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇకపై ఈ పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు. మూటింగ్, అడ్వకేసీ సొసైటీ గురించి సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 2012లో ప్రారంభించిన ఈ సొసైటీ ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దేశంలో పేరొందిన ప్రఖ్యాత న్యాయవాది డీవీ సుబ్బారావు పేరిట పోటీలను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, మూటింగ్ సొసైటీ ఫ్యాకల్టీ డాక్టర్ వి.సునీత, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డాక్టర్ నీలిమ, డాక్టర్ సీహెచ్ లక్ష్మి, విద్యార్థి సమన్వయకర్తలు సంస్కృతి సిన్హా, అర్జిత్ మిశ్రా, కార్తికేయ భన్సాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావుకు అభినందన



జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావును సత్కరిస్తున్న దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు

పెందుర్తి: జిల్లా రిజిస్ట్రార్‌గా నియమితులైన తంగుడు ఉపేంద్రరావును రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు అభినందించారు. శుక్రవారం ఆయన్ను కలిసి దుశ్శాలువా వేసి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఉపాధ్యక్షుడు బలగా చిన్నారావు, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పెందుర్తి లేఖర్ల సంఘం ప్రతినిధులు డి.సుధీర్, ఎ.శ్రీనివాసరావు, జి.శంకర్, పి.కరుణ, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్‌పై భూ కబ్జా కేసు



గెడ్డవాగును ఆక్రమించి రియల్టర్ నిర్మించిన ప్రహరీ

సబ్బవరం: మండలంలోని సబ్బవరానికి చెందిన రియల్టర్ కాపుశెట్టి దుర్గాప్రసాద్‌పై స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వెంకట అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి భూ కబ్జా కేసు నమోదు చేసినట్లు సీఐ పిన్నంటి రమణ తెలిపారు. వివరాలు. మండలంలోని ఇరువాడ గ్రామం సర్వే నెం.103, 106లలో ప్రభుత్వ భూమి వాగు పోరంబోకును దుర్గాప్రసాద్ ఆక్రమించుకున్నారు. తాత్కాలిక ప్రహరీ నిర్మించి, గెడ్డవాగు నుంచి మట్టి రోడ్డును వేశాడు. దీంతో దిగువనున్న బొట్టపాత్రుని చెరువు, రాజ్ చెరువులకు సాగునీరు వెళ్లట్లేదు. దీనిపై ఆయా చెరువుల ఆయకట్టు రైతులు, ఇరువాడ గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే జరిపి, దుర్గాప్రసాద్ 1.20 ఎకరాల గెడ్డవాగు భూమిని ఆక్రమించినట్లు నిర్ధారించారు. దీంతో ఫ్లగ్‌మార్కింగ్ చేసి ఆక్రమణలు తొలిగించాలని పలుమార్లు నోటీసులిచ్చినా తొలగించలేదని డీటీ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులు

సబ్బవరం: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు విద్యార్థులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, ఫణీంద్రకుమార్‌లు మాట్లాడుతూ సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలకు ప్రహరీ గోడ, సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఆర్ట్స్ విద్యార్థులకు ఉదయం, సైన్స్ విద్యార్థులకు మధ్యాహ్నం.. ఒంటిపూట తరగతులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందట్లేదని ఆక్షేపించారు. అదనపు తరగతి గదులతోపాటు, అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. సబ్బవరం మండల కేంద్రంగా వసతి గృహాల్లేక దూరప్రాంత విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే బీసీ బాలుర, ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సబ్బవరం మండల సమాఖ్య నాయకులు ఇమాన్యుయేల్, ఆది, శ్రీను, ధనలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పెందుర్తి: యువీ కెన్ ఫౌండేషన్(యువరాజ్ సింగ్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్‌ను నివారించాలంటే ముందుగా అవగాహన అవసరమన్నారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు ఫౌండేషన్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. 25 నుంచి 65 ఏళ్ల వయసు మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి నివారించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు డాక్టర్ చరిత, డాక్టర్ మాధురి, డాక్టర్ తేజస్వి 50 మంది మహిళలకు స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. డాక్టర్ ఎం.నాగమణి, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరితగతిన యూజీడీ పనుల పూర్తి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ పనులను త్వరితగతిన పూర్తిచేసి, యూజీడీ కోసం తవ్వకాలు జరిపిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యూజీడీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ‘ఇది మంచి ప్రభుత్వం’ స్టిక్కర్లు



ముదపాకలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మండలంలోని ముదపాకలో శుక్రవారం పర్యటించారు. గత 100 రోజులుగా కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు ఇంటింటికి ‘ఇది మంచి ప్రభుత్వం’స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత ఆరోగ్యకరమని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులచే స్వచ్ఛత, పరిశుభ్రతపై శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, ప్రభుత్వ ఆస్పత్రులు వంటి ప్రదేశాల్లో డిగ్రీ కళాశాల విద్యార్థులో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ నివేదిత, కంప్యూటర్ అధ్యాపకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



గర్భిణులకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయుడుపాలెం, ఎన్టీపీసీ నివాసులు

పరవాడ: విజయవాడ వరద బాధితులకు ఆర్థికసాయం అందించేందుకు నాయుడుపాలెం, ఎన్టీపీసీ ప్రాంతాలకు చెందిన పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, కార్మికుల నుంచి రూ.58 వేలు విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులకు రూ.500 చొప్పున నగదు, రొట్టెలను పంపిణీ చేసినట్లు నాయుడుపాలేనికి చెందిన చుక్క నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమూజి శ్రీను, దుంగల అక్కునాయుడు, ఏదూర గోవిందు, బండారు శ్రీను పాల్గొన్నారు.